వాట్సాప్ గ్రూపుల సభ్యత్వానికి తహతహ !

- బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం గ్రూపుల్లో పోటీపడుతున్న ప్రధాన పార్టీలు
- వ్యతిరేకిస్తున్న సభ్యులు, రోజూ వందల పోస్టులతో ఇబ్బందులు
- రాజకీయ పోస్టులతో సతమతమవుతున్న గ్రూప్ అడ్మిన్లు

రాజేంద్రనగర్: నియోజకవర్గ ప్రధాన పార్టీల అభ్యర్థులు బస్తీలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, విల్లాల సంక్షేమ సంఘం వాట్సాప్ గ్రూపుల్లో సభ్యత్వం కోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గం పరిధిలోని ప్రతి బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్, విల్లాలకు సంబంధించిన సంక్షేమ సంఘాలు కొనసాగుతున్నాయి. సంక్షేమ సంఘాల అభివృద్ధి, స్థానికంగా మౌలిక వసతుల కల్పన కోసం ఈ సంఘాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘాల్లో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు కార్యవర్గ సభ్యులు కొనసాగుతున్నారు. ప్రతి సంక్షేమ సంఘం తమ కార్యవర్గ సభ్యులతో పాటు తమ కాలనీ, బస్తీలకు చెందిన వారందరి ఫోన్ నంబర్లతో వాట్సాఫ్ గ్రూపులను ఏర్పాటు చేసుకుంది. ఈ వాట్సాఫ్ గ్రూపుల్లో కేవలం తమ సంక్షేమ సంఘం అభివృద్ధి, చేపడుతున్న కార్యక్రమాలు ఇతర ముఖ్య సమాచారం ఎమైన ఉంటే పోస్టు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ గ్రూపుల్లో తమకు స్థానం కల్పించాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు వేడుకుంటున్నారు. తమ ప్రచారాన్ని ఈ గ్రూపుల ద్వారా నిర్వహించుకుంటామంటూ విన్నవిస్తున్నారు. దీంతో ప్రచారం కాస్తా వాట్సాప్ గ్రూపుల్లో ప్రారంభమైంది.



అడ్మిన్‌లను ప్రసన్నం చేసుకుంటున్న అభ్యర్థులు...

వాట్సాప్ గ్రూపుల అడ్మిన్ల వివరాలను తెలుసుకుంటున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వారిని ప్రసన్నం చేసుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వారితో సమావేశాలు నిర్వహించి ముఖ్య నాయకుని నంబర్‌ను అందులో యాడ్ చేయిస్తున్నారు. రోజూ ఈ గ్రూపుల్లో తమ పార్టీకి సంబంధించిన ఫోటోలు, క్లిప్పింగ్‌లు, పేపర్‌లో వచ్చిన వార్తలను పోస్టు చేస్తున్నారు.

వ్యతిరేకిస్తున్న కొందరు...

ప్రస్తుతం కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘాల వాట్సాఫ్ గ్రూపుల్లో పార్టీల ప్రచారాన్ని స్థానిక సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో విభేధిస్తున్నారు. ఇంటింటికీ ప్రచారం చేసుకోవచ్చని.. ఇలా గ్రూపుల్లో పోస్టులు చేయడం సరి కాదంటూ పోస్టులు పెడుతున్నారు. కొందరు ఈ గ్రూపుల్లో ఉదయం నుంచి అర్థ రాత్రి వరకు పార్టీల ప్రచార పోస్టులతో విసుగు చెంది లెఫ్ట్ అవుతున్నారు.

వాట్సాప్ ప్రచారమే ముఖ్యం..

వాట్సాప్ గ్రూపుల్లో వందలాది మంది ఉంటుండటంతో ఇందులో ప్రచారం కోసం అన్ని పార్టీల నాయకులు మొగ్గు చూపుతున్నారు. ఒకే ఒక పోస్టుతో వందల మందికి చేరుకోవచ్చనే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

- రోజూ ప్రత్యేకంగా అభ్యర్థులే గ్రూపుల వివరాలను తెలుసుకుంటూ.. ముఖ్య నాయకులను అన్ని గ్రూపుల్లో సభ్యత్వం పొందాలంటూ ఆదేశిస్తున్నారు.
- ప్రచారం రోజు రోజుకు వేడెక్కుతుండటంతో వాట్సాప్‌లలో ఈ ప్రచారం ఇంకాస్తా రగులుతోంది.

ఎవరికీ చెప్పలేకపోతున్నాం...

తమ బస్తీ, అపార్ట్‌మెంట్, విల్లాల అభివృద్ధి కోసం తాము ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపుల్లో పార్టీల వారి నంబర్లను యాడ్ చేయడం ఇబ్బందిగా మారిందని సంక్షేమ సంఘం సభ్యులు వాపోతున్నారు. ఏ ఒక్కరినీ కాదన్న రేపు దాని పరిణామం ఏలా ఉంటుందో చెప్పలేక సతమతమవుతున్నామంటూ వెల్లడిస్తున్నారు. ఒకరిని యాడ్ చేయగానే ఇతర పార్టీల వారు తమను యాడ్ చేయాలని చెబుతున్నారని, దీంతో సభ్యులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. రోజూ ఒకపోస్టు చేయాలని తెలిపినా, తమ కాలనీకి వచ్చినప్పుడు పోస్టు చేయాలన్నా పట్టించుకోవడం లేదని వెల్లడిస్తున్నారు.

బీ ఫారమ్ అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థి



మణికొండ: రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కస్తూరి నరేందర్‌ముదిరాజ్ మంగళవారం గాంధీభవన్‌లో బీ ఫారమ్‌ను తీసుకున్నారు. ఏఐసీసీ ఇన్‌చార్జ్ రోహిత్ చౌదరి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. ఈనెల 9న నామినేషన్ వేసే విషయాన్ని పరిశీలిస్తున్నామని, నామినేషన్ దాఖలు చేయగానే పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

కాంగ్రెస్‌కు అన్ని వర్గాల మద్దతు..

మణికొండ: రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పవనాలు వీస్తున్నాయని, అన్ని వర్గాలు ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నాయని, రాజేంద్రనగర్‌లోనూ.. గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని అభ్యర్థి కస్తూరి నరేందర్‌ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సమక్షంలో నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన నాయకులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరారు.

'ఓట్ల' పరుగులు రావాలని...

శంషాబాద్: పట్టణంలోని తొండుపల్లి మైదానంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కస్తూరి నరేందర్ ముదిరాజ్ బ్యాట్ చేత పట్టుకుని క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ప్రచారంలో భాగంగా ఆయన యువతను కలిసి చేతిగుర్తుకు ఓటు వేసి మద్దతు తెలపాలని యువ ఓటర్లను కోరారు.

ప్రధాని సభకు తరలిన బీజేపీ శ్రేణులు



మణికొండ నుంచి బహిరంగ సభకు వెళ్తున్న దృశ్యం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్ నుంచి ప్రధాని మోదీ సభకు మంగళవారం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మధ్యాహ్నం నుంచి నాయకులు, కార్యకర్తలు ర్యాలీలు, పాదయాత్రలు నిర్వహిస్తూ.. ప్రధాన కూడళ్ల వద్దకు చేరుకున్నారు. అనంతరం బస్సులు, కార్లలో సభాస్థలికి తరలివెళ్లారు. శివరాంపల్లి నుంచి జిల్లా ఓబీసీ మోర్చా సెక్రటరీ హరికిషన్‌జీ, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రాహుల్‌రెడ్డి, పద్మక్క, సందీప్‌రెడ్డి, జగదీష్, మనోజ్ యాదవ్, శ్రీనివాస్, మనోజ్‌జీ, నవీన్‌రెడ్డి తదితరులున్నారు.

మణికొండ నుంచి..

మణికొండ: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగసభకు మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివెళ్లారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు బీరప్ప ఆధ్వర్యంలో 5 బస్సులలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీ సత్తాచాటి తమ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తామన్నారు. పార్టీ మున్సిపల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేవైఎం కార్యవర్గ సభ్యుడి రాజీనామా



కె. శ్రావణ్‌గౌడ్

శంషాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టు కాలనీ మాజీవార్డు సభ్యుడు, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడైన క్లెం శ్రావణ్‌గౌడ్ మంగళవారం బీజేపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడికి పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ నినాదం చేస్తున్న బీజేపీలో బీసీలకు ఏమాత్రం గౌరవం లేదని ఆరోపించారు.

శ్రీవారికి అభిషేకం



హఫీజ్‌పేట్ : వేంకటేశ్వరస్వామి అష్టవింశ బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం నిత్యోపాసన, ఉత్సవాన్త స్నపనంను వైభవంగా నిర్వహించారు. ఉదయం మహా సుదర్శన హోమం, మధ్యాహ్నం 12.00 గంటలకు హారతి తీర్థప్రసాదాలు అందించారు. శ్రీవారికి పుష్పాలంకరణ, గరుడ వాహన సేవ, అన్నప్రసాద వితరణ, సహస్ర దీపాలంకార సేవను కె.సత్యనారాయణ రాజు నిర్వహించారు.

గవర్నర్‌కు ఆహ్వానం



గవర్నర్‌ను ఆహ్వానించిన నిర్వాహకురాలు మాధవీలత

అబిడ్స్: సీతారామ్‌బాగ్ శ్రీరామ మందిరంలో జరుగుతున్న భారత భాగ్య సమృద్ధి యజ్ఞానికి రావాలని గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌ను నిర్వాహకురాలు మాధవీలత ఆహ్వానించారు. మంగళవారం గవర్నర్‌ను కలిసి దేశ సమృద్ధి కోసం, దేశం సస్యశ్యామలంగా ఉండేవిధంగా ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ యజ్ఞంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. త్వరలోనే యజ్ఞాన్ని సందర్శిస్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యమన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మహ్మద్ ఒమర్ ఖాన్

చార్మినార్: సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎంతో చురుకుగా పాల్గొంటూ పాతబస్తీలోని పలు స్వచ్ఛంద సంస్థలకు ఆదర్శంగా నిలుస్తున్న మహమ్మద్ ఒమర్ ఖాన్ అభినందనీయులని ఎస్ఆర్‌జడ్ ఎంటర్ ప్రైజెస్ డైరెక్టర్ అబద్దుర్ రెహ్మాన్ అన్నారు. పాతబస్తీ శివారులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో మహమ్మద్ ఒమర్‌కు ఉత్తమ సేవా అవార్డు–2023ను అందజేశారు. ఈ సందర్భంగా రెహానా సిద్దిఖీ, షాజియా కిద్వాయ్‌ల ఆధ్వర్యంలో జరిగిన ముషాయిరా, కవి సమ్మేళనం ప్రేక్షకులను అలరించింది.

మైనార్టీల సంక్షేమానికి కృషి



శంషాబాద్: పట్టణంలోని నాల్గోవార్డు కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్‌టీపీ నేతలు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ కట్టుబడి ఉందని, భారీ మెజార్టీయే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయూబ్, సులేమాన్ బీఆర్ఎస్‌లో చేరగా.. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు గణేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఓట్లే లక్ష్యంగా...

అత్తాపూర్: ముస్లిం మైనార్టీ ఓట్లే లక్ష్యంగా పెట్టుకుని ఇంటింటా ప్రచార కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తున్నట్లు రంగారెడ్డి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మిద్దెల బ్రదర్స్ సురేశ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డిలు అన్నారు. గత ప్రభుత్వాలు ఎవరూ చేయని విధంగా ముస్లిం మైనార్టీలకు అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించామన్నారు. షాదీ ముబారక్ రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి లబ్ధిదారుల సంఖ్య రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రంలో హ్యాట్రిక్, నాల్గోసారి ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డివిజన్‌లో రాజేంద్రనగర్, మాణిక్యమ్మకాలనీల్లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి పలుగుచెరువు మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ అర్చన జయప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముర్తుజా అలీ, చలసాని విష్ణుమూర్తి, యాదమ్మయాదవ్, జాన్‌పాల్, శ్రీధర్‌రెడ్డి, నరేశ్‌యాదవ్, నందిగామ నర్సింహ, జీవన్‌దాస్, పచ్చ శ్రీనివాస్, కాటిదేవ్, సాయి మల్లిక్, మంజుల, సుమలత, సుజాతగౌడ్, సాయిగౌడ్ తదితరులున్నారు.

కార్యకర్తల ప్రచారం...

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీలో కార్యకర్తలతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను భారీ మెజారిటీతో మరోసారి గెలిపించాలని ఓటర్లను కోరారు. వజ్రమ్మ, శరణమ్మ, సరికొండ వెంకటేష్ ,రాఘవేంద్రయాదవ్ ,గోవింద రాజు, డీవీ. కుమార్, మహేష్, జీవన్‌గౌడ్, ఆంజనేయులు మేస్త్రీ, వెంకటేష్, క్రిష్ణ, శ్రీనివాస్, సామల సత్యం, సతీష్, ముక్తేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

మణికొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు బీఆర్ఎస్ పార్టీ నేతలు శ్రమిస్తున్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలో పార్టీ సమన్వయకర్త, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షుడు శ్రీరాములు, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డిల ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి అపార్టుమెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, గృహాల వారీగా తిరుగుతూ.. పార్టీ మేనిఫెస్టోను వివరిస్తూ.. కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖ యాదగిరి, వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, పార్టీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా, కౌన్సిలర్లు ఆధ్వర్యంలో ఎవరి వార్డుల పరిధిలో వారు జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

బీజేపీలోకి చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ నియోజకవర్గం అభివృద్ధి బీజేపితోనే సాధ్యమని రాజేంద్రనగర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం మైలార్‌దేవ్‌పల్లిలోని తన నివాసంలో వేంకటేశ్వర కాలనీ (బుద్వేల్)నుంచి వివిధ పార్టీల నుంచి భారీగా యువకులు బీజేపీలో చేరారు. అనంతరం తోకల మాట్లాడుతూ.. రాజేంద్రనగర్‌లో యువత తలుచుకుంటే గెలువడం సులభం అవుతుందని అభిప్రాయపడ్డారు. గెలుపోటములు యువతపై ఆధారపడి ఉన్నాయన్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. పార్టీ సీనియర్ నాయకులున్నారు.

అక్రమ పార్కింగు !

- ఇరుకురోడ్డుతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు



బండ్లగూడ ప్రధాన రహదారి పక్కనే పార్క్ చేసిన వాహనాలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ పార్కింగ్‌లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి ఇరువైపుల ఉన్న హోటళ్ల ముందు కార్లు, ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పోలీస్ అకాడమీ నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జి వరకు ఉన్న ప్రధాన జాతీయ రహదారిపై అక్రమంగా హోటళ్లకు వచ్చే వారు వాహనాలను పార్కు చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో ఈ రహదారి పూర్తిగా రద్దీగా మారుతుంది. ద్విచక్ర వాహనదారులు కార్ల మధ్య నుంచి వెళ్లే సమయంలో కిందపడిపోతున్నారు. ఒక్క బస్సు సైతం వెళ్లలేకుండా రోడ్డు మీదనే కార్లను పార్కు చేస్తున్నారు.

ట్రాఫిక్ సిబ్బంది విఫలం..

జాతీయ రహదారిపై ఇంత వ్యవహారం జరుగుతున్న ట్రాఫిక్ పోలీసులు అక్రమ పార్కింగ్‌ను కట్టడి చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై పార్కు చేస్తున్న వాహనాలను నియంత్రించాలని వారు కోరుతున్నారు.

ఎర్రచందనం చెట్లకు సెన్సార్ చిప్‌ల అమరిక

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో 50 ఎర్రచందనం చెట్లకు రియల్ టైమ్ మానిటరింగ్ ఐఓటీ ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్‌ను అమర్చినట్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం సీబీఐఓటీ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన ఎలక్ట్రానిక్ చిప్ సెన్సార్ గురించి డెమో, సెమినార్‌ను మంగళవారం బొటానికల్ గార్డెన్‌లోని సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చిప్ అమర్చిన చెట్లను ఎవరైనా నరికి వేయాలనుకున్నా, దొంగిలించాలనుకున్నా సెక్యూరిటీ మొబైల్‌కు సందేశం వస్తుందని, అలాగే బొటానికల్ గార్డెన్‌లో అమర్చిన హూటర్ పరికరాన్ని యాక్టివేట్ చేయడం ద్వారా ఎలక్ట్రానిక్ సైరన్ మోగి సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అవుతారని చెప్పారు. సమావేశంలో టీఎస్ఎఫ్‌డీసీ ఎకో టూరిజమ్ ప్రాజెక్టు మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్లు లక్ష్మారెడ్డి, మధుసూదన్, సీబీఐఓటీ టెక్నాలజీ ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ప్రాజెక్టు ఇంజనీర్ విష్ణు, టీఎస్ఎఫ్‌డీసీ శాంసన్‌రాజు, వీరబాబు, వెంకటేష్, ఎఫ్‌సీఆర్ఐ, తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, కంటోన్మెంట్ బోర్డు, హెచ్ఎండీఏ, హెచ్‌సీయూ, ఎన్‌జీఆర్ఐ, బయోడైవర్సిటీ బోర్డు, ఎస్ఐఆర్‌డీ, టీఎస్‌పీఏ, జీహెచ్ఎంసీ, ఓయూ అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన వర్క్‌షాపు

సంతోష్‌నగర్: మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని)లో రెండు రోజుల పాటు మెటలర్జీ ఫర్ నాన్ మెటలర్జిస్ట్ ఇండస్ట్రియల్ ప్రాక్టీసెస్‌పై నిర్వహించిన వర్క్ షాపు మంగళవారం ముగిసింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఐటీఈ అండ్ సీ ప్రిన్సిపాల్ సెక్రటరీ జయేశ్ రంజన్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాపులో వివిధ ఎంఎస్ఎంఈలు, ప్రైవేటు పరిశ్రమలు, విద్యా సంస్థలకు చెందిన దాదాపు 150 మంది నిపుణులు పాల్గొన్నారు. మెటలర్జీ, హీట్ ట్రీట్‌మెంట్, కోరోషన్, ఫౌడర్ మెటలర్జీ, ఎన్‌డీటీ, మెటల్ జాయినింగ్, మెటల్ వర్కింగ్ ప్రాథమిక సూత్రాలపై ఉపన్యాసాలు నిర్వహించారు. మిధాని సీఎండీ అండ్ చైర్మన్ సంజయ్ కుమార్ ఝూ ఐఐఎం హైదరాబాద్ చాప్టర్ ప్రోగ్రామ్ స్పాన్సర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి. ముత్తు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జయేశ్ రంజన్, మిధాని సీఎండీ అండ్ చైర్మన్ డాక్టర్ ఎస్.కె.ఝూ

క్యాట్‌లో విద్యార్థుల ప్రతిభ



సాక్షి, సిటీబ్యూరో: మణికొండలోని శ్రీచైతన్య పాఠశాలలో జరిగిన క్యాట్ లెవల్–1 పరీక్షలో 68 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అనిత మాట్లాడుతూ 'క్యాట్ లెవల్–1 పరీక్షలో విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి లెవల్–2కి అర్హత సాధించారు. మ్యాథ్స్‌లో 28 మంది, ఫిజిక్స్‌లో 18 మంది, కెమిస్ట్రీలో 23 మంది ఎంపికయ్యారు. విద్యార్థులు అన్ని పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపించేలా మా విద్యా బోధన, ప్రోత్సాహం ఉంటుంది' అన్నారు. ఈ సందర్భంగా లెవల్–2కి అర్హత సాధించిన విద్యార్థులను ఆర్ఐ అనిత, డీన్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒలింపియాడ్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మి, సి.బ్యాచ్ ఇన్‌చార్జి మస్తాన్ అభినందించారు.

ముగిసిన జాతీయ కల్చరల్ ఫెస్టివల్



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ విఘ్నేశ్వర ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రవీంద్రభారతిలో జాతీయ కల్చరల్ ఫెస్టివల్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు శాస్త్రీయ సంగీత కళలు, జానపద నృత్యాలతో అలరించారు. అనంతరం పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, న్యూ ఐడెన్ హైస్కూల్ ప్రిన్సిపల్ ఎ.శశిపాల్‌రెడ్డి, అకాడమీ అధ్యక్షుడు పి.అమృత్‌కుమార్, ఉపాధ్యక్షులు కేఎస్ అశోక్‌కుమార్, డైరెక్టర్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

8 మంది అభ్యర్థులు నామినేషన్లు

అత్తాపూర్: ఎన్నికల ప్రక్రియలో భాగంగా నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా 8 మంది తమ నామినేషన్లను అత్తాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో దాఖలు చేసినట్లు ఆర్డీఓ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి మల్లయ్య తెలిపారు. ఆమ్‌ఆద్మీపార్టీ నుంచి హేమలత జుల్లోజు మరో నామినేషన్ హేమలత స్వతంత్ర అభ్యర్థిగా దాఖలు చేశారు. రాష్ట్రీయ జన మోర్చా పార్టీ నుంచి మహ్మద్ అమీర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా సాధిక్ బిన్ యూసుఫ్ నామినేషన్ వేశారు. దేశ్ జనహిత పార్టీ నుంచి మహ్మద్ నవాజ్, స్వతంత్ర అభ్యర్థిగా గోవింద్ లాల్, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి గోపాల్ దండోటికర్, మహ్మద్ అబ్దుల్ అజీం స్వతంత్ర తమ నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు మెజార్టీ

శంషాబాద్: సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌కు అత్యధిక మెజార్టీని సాధించిపెడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో కౌన్సిలర్ పారెపల్లి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన అనేక పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించాలన్నారు. నాల్గోసారి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో విజయం అందించాలన్నారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు దూడల వెంకటేష్‌గౌడ్, కొండ దర్శన్, కొండ పరమేష్‌గౌడ్, అమరేందర్‌గౌడ్, అశోక్‌గౌడ్, రాజుగౌడ్, రాచమల్ల సురేష్, విశ్వనాథం, ముస్తఫా, కొండ విష్ణు, గోవర్ధన్‌గౌడ్, నిరంజన్, వీరేష్ తదితరులున్నారు.

లక్ష మెజార్టీతో గెలుస్తారు !

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కస్తూరి నరేందర్ లక్ష మెజార్టీతో గెలవడం ఖాయమని ఆ సీనియర్ నేత కోరని శ్యామ్ ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ డివిజన్ పరిధిలోని బస్తీలు, కాలనీల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటి వెళ్తూ.. కాంగ్రెస్ హమీలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు కోరని బాల్‌రాజ్, బాల్‌రెడ్డి తదితరులున్నారు.

జనతా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బీ ఫారమ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గం జనతా కాంగ్రెస్ పార్టీ తరపున గుంటి గౌతమ్‌కుమార్ పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్‌రాయ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ సర్వేందర్ ప్రకటించారు. రాజేంద్రనగర్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో గౌతమ్ పేరును ప్రకటించి బీ–ఫారమ్ అందజేశారు. వారు మాట్లాడారు. యువకుడు, విద్యావంతుడు కావడంతో పాటు ప్రజల్లో మంచి పేరు ఉన్నందునే పార్టీ అభ్యర్థిగా ప్రకటించామని, నియోజకవర్గంలో విజయం సాధిస్తానని గౌతమ్ ధీమా వ్యక్తం చేశారు.

రక్తదానంకు యువత ముందుకురావాలి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమాండింగ్ ఆఫీసర్–1 కల్నల్ రవీంద్రరావు

రాయదుర్గం: రక్తదానం చేయడానికి ఔత్సాహిక యువత ముందుకు రావాలని తెలంగాణ ఆర్‌టీ బ్యాటరీ ఎన్‌సీసీ హైదరాబాద్ గ్రూప్ కమాండింగ్ ఆఫీసర్–1 కల్నల్ బి రవీంద్రరావు సూచించారు. మనూ విశ్వవిద్యాలయంలోని హెల్త్ సెంటర్‌లో మనూ ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, విక్టోరియా వెల్ఫేర్ సొసైటీ, శ్రీకర బ్లడ్‌బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. 100 మంది విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, సిబ్బంది రక్తదానం చేశారు.